# గౌరవం

మూడు రంగుల జండా ఎగరవేసిన తరవాత చప్పట్లు, వందే మాతరం పాట, ఆపైన స్వాతంత్ర్య దినోత్సవం ముచ్చట్లు—ఇవన్నీ ముగిశాయి ఘనంగా.

కొద్ది కొద్ది మార్పులతో ఇంచుమించు ఇదే కార్యక్రమం చాలా ప్రదేశాల్లో జరిగింది.

కిండర్ గార్టెన్, ఎలిమెంటరీ పాఠశాల, హైస్కూలు, జూనియర్ కాలేజీ, ఆసుపత్రి, రకరకాల ఆఫీసులు, బ్యాంకులు—

బ్రాహ్మణ అగ్రహారం, నాయుడు పేట, హరిజనవాడ, కుమ్మరి వీధి, సెట్టి బలిజ గ్రంథాలయం ఇలా ఎక్కడ పడితే అక్కడ ఆ వీధులు, పేటలు కులాలకు సంబంధించినవైనా కులమత ప్రమేయం లేకుండా జండా వందనం ముగిసింది.

జండావందనం, ఊరేగింపు అయ్యాక, మధ్యాహ్నం పన్నెండవుతుంటే ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు. సాయంత్రం చాలా చోట్ల వినోద కార్యక్రమాలూ అవీ ఉన్నాయి.

కిండర్ గార్టన్ పంతులమ్మ సాయంత్రం నాలుగు గంటలకు స్కూలుకి వచ్చి, స్టేజి డెకోరేషన్‌కీ దానికీ కంగారు పడుతూ ఎందుకో ఒక్కసారి జండా కర్రకేసి చూసి నిర్ఘాంత పోయింది.

ఎలిమెంటరీ స్కూలు మాస్టారు బడికి వచ్చి బల్లలు సర్దిస్తూ

జండా కర్రకేసి చూసి ఆశ్చర్య పోయాడు. హైస్కూలు హెడ్మాస్టరూ అంతే।

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గారూ అలాగే నిశ్చేష్టుడై కాలేజీ ప్రిన్సిపాల్‌గారికి ఫోన్ చేస్తే ఆయనా అదే స్థితిలో ఉన్నట్లు తెలిసింది.

వాళ్ళ ఆశ్చర్యానికి కారణం—వాళ్ళవాళ్ళ ప్రదేశాలో ఎగర వేయ బడిన జండాలు కనబడలేదు. జండా కర్రలే కనిపించాయి.

ఆసుపత్రిలో, బ్యాంకుల్లో, ఆఫీసుల్లో ఎక్కడా జండాలు కనబడ లేదు. అంతేకాదు, మంత్రిగారు స్వయంగా ఆవిష్కరించిన జండా, పరిషత్ ఆఫీసులో జండా, సిల్కు జండా, పెద్దజండా—అది కూడా కనబడలేదు.

ఛైర్మన్ గారూ, సెక్రటరిగారూ గంతులేశారు. మంత్రిగారింకా ఊళ్ళోనే ఉన్నారు. ఆయనకు తెలిస్తే ఎలాగన్నారు. చివరికి ఆయనకు కూడా తెలిసిపోయింది. ఆయనకేమిటి, ఇంచుమించు ఊరు ఊరంతా తెలిసిపోయింది.

పోలీసులందరికీ అదే, అన్ని స్టేషన్లలో పోలీసులకు వర్తమానం వెళ్ళింది.

"ఇవేదో దేశద్రోహుల పని।" అన్నారు ఛెయిర్మన్‌గారు.

"కాదూ మరి।" వంత పలికారు సెక్రటరీగారు. "కాదు. ఇది నక్సలైట్ల పనే। నా నియోజక వర్గంలో కూడా వీళ్ళు ప్రబలి పోతున్నారంటే నాకు చాలా ఆందోళనగా ఉంది". నిజంగా ఆందోళన పడ్డారు మంత్రిగారు.

"ఇది చరిత్రలో కనీ వినీ ఎరగం. స్వతంత్ర దినం నాడు మన జండాలు మాయమవటం, మన పట్టణానికే—కాదు, కాదు మన దేశానికే తీరని అవమానం" అన్నారు ఓడిపోయిన ఎమ్. ఎల్. ఏ. గారు.

అలా ఎవరి కిష్టం వచ్చింది వాళ్ళు అన్నాక, రకరకాల కామెంట్సు, చర్చలు జరిగాక - వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌నుంచి ఛెయిర్మన్‌గారికీ, సెక్రటరీగారికీ, ఇంకా తదితర పెద్దలకూ ఫోన్‌లు వచ్చాయి. దుండగీడు దొరికాడని.

హుటాహుటిని పెద్దలంతా వన్‌టౌన్ స్టేషన్‌కు వెళ్ళారు. "ఎక్కడ దేశద్రోహి" అన్నారు. చూపించాడు ఇన్‌స్పెక్టర్. చూశారు అందరూ.

"వీడా ఈ పని చేస్తే? వీడా దేశద్రోహి??" అన్నారు.

అతనొక కుర్రాడు. వయస్సు పదికీ పన్నెండుకీ మధ్య. ఒంటి మీద గోచీ ఒక్కటే ఉంది. అతని పక్కనే చిన్న మూట. ఆ మూటలో జండాలు.

"వీడి వెనకాల ఏదో ముఠా ఉన్నట్టుంది" ఎవరిదో అనుమానం

"లేకపోతే వీడికింత ధైర్యం ఉండదు" మరెవరిదో సన్నాయి నొక్కు.

'ఎక్కడుంటావురా నువ్వు?' అడిగారు వాణ్ణి. "పోలమ్మ సెరువ్వు కాడండి" చెప్పాడు వాడు.

"చూపిస్తావా మీ ఇల్లు మాకు?"

"సిత్తం"

మంత్రిగారికి ఫోన్ చేసి చెప్పారు ఛెయిర్మన్‌గారు, పోలీసు సూపరింటెండెంటుగారు వేర్వేరుగా ఇద్దరికీ ఒకే సమాధానం చెప్పారు మంత్రిగారు.

"ఇదుగో జాగర్త కుర్రవెధవకదా అని వాడి వెనకాలెడితే పెద్ద ముఠా ఉండవచ్చు. వాళ్ళు దేనికైనా తెగిస్తారు. సిబ్బందిని గట్టిగా తీసు కెళ్ళండి. లేకపోతే అనవసర పరువు పోతుంది".

కుర్రాణ్ణి తీసుకుని, వాడు చెప్పిన గుర్తులను పట్టుకుని వెళ్ళారు పోలీసులు, పుర ప్రముఖులు. అలా తీసుకువెళుతున్నపుడు ఛెయిర్మెన్ గారినీ, సెక్రటరీగారినీ పోలీసులు తీసుకెళుతున్నారని ఊళ్ళో గిట్టని వాళ్ళనుకున్నారు గానీ, నిజంగా పోలీసులు తీసుకెళ్ళింది ఆ కుర్రాడినే.

''నీ పేరేమిట్రా?'' కుర్రాణ్ణడిగాడు ఓ పోలీసు జీపులో. "సీరాములండి'' చెప్పాడు కుర్రాడు.

ఒళ్ళు మండిపోయిందా పోలీసుకి, తన పేరే వాడు పెట్టుకున్నందుకు. "నోరు మూసుకో!" అంటూ ఒక్కటిచ్చాడు అందుకే.

శ్రీరాములు ఇంటి ముందు పోలీసు బందోబస్తుతో జీపు ఆగింది.

అంతా వెళ్ళేసరికి—

ఓ గోనెపట్టా మీద కూర్చునుంది ఓ ఆడది. ఓ పెద్ద జండామీద కూర్చున్నాడు ఓ మగాడు. ఇద్దరికీ మధ్య జండాలు; కుప్పలుగా, పోగులుగా జండాలు.

పోలీసులను చూసి కంగారుగా లేచి నుంచుంది ఆడది. కంగారు పడ్డాడు కాని, లేచి నించోలేదు మగాడు.

ఆ నించోని మగాడు శ్రీరాములు తండ్రి. ఆ నించున్న ఆడది శ్రీరాములు తల్లి.

''ఏరా, ఎవురొచ్చారనుకున్నావ్?'' అడిగాడు పోలీసు కోపంగా.

లేద్దామని ప్రయత్నం చేశాడు శ్రీరాములు తండ్రి. "ఎవరొచ్చినా ఆడు లేవలేడు బాబూ, ఆడు కుంటోడు'' అంది శ్రీరాములు తల్లి.

''ఏడిశాడు! కుంటోడయితే మాకన్ను కప్పి ఇన్ని జండాలు మాయం చేశాడా?" అన్నాడు ఇన్స్పెక్టరు.

కర్ర సాయంతో అతి కష్టం మీద ఎలాగో లేచి నుంచున్నాడు శ్రీరాములు తండ్రి.

జండాలు పరిశీలించారంతా. ఏడెనిమిది పెద్ద పెద్ద జండాలు లుంగీగా అతికి కుట్టబడ్డాయి. మరో మూడు జండాలు ఓ పాత చీర మధ్య అతుకులుగా మలచబడ్డాయి. మరో కొన్ని జండాలు చెడ్డీగానూ, మరో కొన్ని జుబ్బాగానూ తయారౌతున్నాయి.

జండాలను పరిశీలించటానికి ముందు శ్రీరాములు తండ్రినీ తల్లినీ పరిశీలించ వలసింది. కాని, ముందు పనులు వెనక వేయడం మన వాళ్ళ కెప్పుడూ అలవాటు కనుక ఇప్పుడు పరిశీలించారు.

శ్రీరాములు తల్లి ఒంటి మీద చీర కప్పిన భాగం కన్నా చిరుగులు కప్పిన భాగమే ఎక్కువ ఉంది.

శ్రీరాములు తండ్రి చిరుగులతో వేలాడుతున్న ఆ బనియను, నిక్కరు ఎలా తొడుక్కున్నాడో అతనికే తెలియాలి.

అక్కడున్న అందరికీ కోపం వచ్చింది, దేశ గౌరవాన్ని మంట గలిపినందుకు. కాని, వాళ్ళందరి కన్నా ఎక్కువ కోపం ఛెయిర్మన్ గారికొచ్చింది.

"మీకంతగా కట్టుకునేందుకు గుడ్డలు లేక పోతే, నన్నో ఎవర్నో అడగాలి కానీ, మన జండా, మన గౌరవం, మన దేశం—వీటిని అవ మానిస్తార్రా; గాడిద కొడుకుల్లారా!" అంటూ ఊగి పోయాడాయన.

నెల రోజుల క్రితం నడవలేక నడుస్తూ ఎవరో కుంటాడు—"ఓ పాత పంచె ఇప్పించండి బాబయ్యా!' అంటూ గేటు దగ్గర అడిగినట్లు లీలగా గుర్తుందికాని, అది సుతరామూ బయట పెట్టడం ఇష్టంలేక పోయింది ఛెయిర్మన్‌గారికి ఆ క్షణంలో.

''ఇంకా ఎక్కడరా మీ మనుషులు?" అంటూ అరిచాడు ఇన్ స్పెక్టరు.

''ఏదో సరదాగా ఎగరేసే గుడ్డలనుకున్నాం గానీ, మాకు అది తీయ కూడదని, మీరింత గొడవ చేస్తారని తెలీదు. మా ప్రభూ" అంటూ వేడుకున్నాడు శ్రీరాములు తండ్రి.

"గుడ్డల్లేనుండా నలుగురికి కనబడలేక, ఆ కుర్ర నాగన్న చేత్తా నంటే చేయమన్నాంగానీ మాకేటీ తెల్దు'' అంటూ ప్రాధేయపడింది శ్రీరాములు తల్లి.

"అయితే మీరిద్దరే ఈ పని చేశారన్న మాట. మీ వెనకాల ఏ గాంగూ లేదూ?" ప్రశ్నించారు ఎ. ఎస్. పి గారు.

"మేం ఇద్దరం ఏటి ? ఈ జండాలన్ని నేనే తెచ్చా. మా అయ్యేం కదుల్తాడు?'' అన్నాడు శ్రీరాములు.

"ఛ - నోర్ముయ్!" అన్నాడు ఇన్ స్పెక్టరు.

* * *

కొన్ని రోజులు పోయాక — శ్రీరాములుగాణ్ణీ వాడి కుంటి తండ్రినీ కోర్టులో నిలబెట్టారు. శ్రీరాములు తల్లి జనంలో కూర్చుంది.

కేవలం తెలియకే చేశానన్నాడు శ్రీరాములు. కుర్రాణ్ణి ఒగ్గేయ మన్నాడు శ్రీరాములు తండ్రి. మామూలుగా చెప్పుకోవలసిందంతా చెప్పు కున్నారు వాళ్ళు. అంతా విని, మెజిస్ట్రేటుగారు ఇండియన్ పీనల్ కోడ్ ఇంకా ఏవో చట్టాలు - శ్రీరాములుకీ తండ్రికే కాకుండా అక్కడ ఇంకా చాలా మందికి అర్థం కానివి ఏవేవో సెక్షన్సు చెప్పి చివరకు గంభీర మైన గొంతుతో ఇలా అన్నారు.

"తెలిసి చేసినా తెలియక చేసినా నేరం నేరమే. శ్రీరాములు తండ్రి అయిన నరసింహులుకీకూడా ఈ నేరంలో భాగం ఉందని ఋజు వైంది. అందుచేత జాతీయ పతాకాన్ని ఇష్టం వచ్చినట్లు వాడుకున్నందుకు

జాతీయ గౌరవాన్ని కించ పరిచి నందుకు రెండు సంవత్సరాల కారాగార శిక్ష విధించడమైనది. శ్రీరాములు కుర్రవాడు కాబట్టి జువెనైల్ స్కూల్‌కి పంప వలసింది''.

ఇంతలోనే శ్రీరాములు తల్లి జైలు అనగానే జనంలోంచి మధ్యకు వచ్చి ''బాబ్బాబ్బాబు! అల్లితో బాటు నన్నుకూడా ఎట్టించండి జైల్లో'' అంది.

''నిన్నెందుకే జైల్లో ఎట్టడం?'' అంటూ ఇద్దరు పోలీసులు చెరో రెక్కా పట్టుకున్నారామెను.

'అల్లెల్లిపోతే నాకు తిండెలాగ దేవుడో? జైల్లో అయితే నాక్కూడా ఇంత ముద్ద ఎత్తారు" అంటూ అరుస్తుంటే పోలీసులు బయటకు లాక్కు పోయారామెను.

మరో కేసు చదవ బోతున్న బెంచి గుమస్తాకు కోర్టులో అలా అరిచి కోర్టు మర్యాదను పాటించకపోవటం—కంటెమ్ట్ ఆఫ్ కోర్ట్ కిందకు వచ్చి ఆమెను అరెస్టు చెయ్యొచ్చేమోననిపించింది కాని, మేజిస్ట్రేటు గారు ఏమంటారోనని మాట్లాడలేదు.

''వాళ్ళకి తినటానికింత తిండి, కట్టుకోవటానికి అంత బట్ట ఇవ్వ లేక పోయారు గానీ, జాతీయ గౌరవాన్ని పాడు చేసారని శిక్షవేయటం అన్యాయంకదూ?'' అని అప్పుడే వృత్తిలో ప్రవేశించిన ఓ జూనియర్ లాయరు తన సీనియర్‌తో అన్నాడు గానీ, ఆయన గుడ్లు ఉరిమి చూడటంతో నోరు మూసుకున్నాడు.